

డీసీసీబీకి పర్సన్ ఇన్‌చార్జి కొనసాగింపు

శ్రీకాకుళం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు (డీసీసీబీ)కు ప్రస్తుతం ఉన్న పర్సన్ ఇన్‌చార్జిలను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్రంలో 13 డీసీసీబీలకు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పర్సన్ ఇన్‌చార్జిలుగా జిల్లా జాయింట్ కలెక్టర్‌లను నియమించింది. ఆ గడువు ముగుస్తుండటంతో ఈ నెల 27నుంచి మరో ఆరు నెలలు వారిని కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులను జారీచేశారు. ఈమేరకు శ్రీకాకుళంలో డీసీసీబీకి జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్.. మరో ఆరునెలలు పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతారు.

న్యూస్ బాక్స్

డీఎంహెచ్‌వోగా బాల మురళీకృష్ణ

శ్రీకాకుళం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ టీవీ బాలమురళీకృష్ణ నియమితులయ్యారు. శనివారం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా డీఎంహెచ్‌వోలను బదిలీ చేసింది. ఆయా స్థానాల్లో డిప్యూటీ సివిల్ సర్జన్లకు పదోన్నతి కల్పించింది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా బడినేహల్ పీహెచ్‌సీ వైద్యులు బాలమురళీకృష్ణ(డిప్యూటీ సివిల్ సర్జన్)ను పదోన్నతిపై శ్రీకాకుళం డీఎంహెచ్‌వోగా నియమించింది. ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షిని విశాఖ ఆర్‌టీసీ(మేల్) విభాగానికి ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసింది. అలాగే కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డీసీఎస్ఆర్ ఎంవో డాక్టర్ కె.అనిత.. బదిలీపై శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి సీఎస్ఆర్ఎంవోగా రానున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీహరిబాబు పదోన్నతిపై పలాస కిడ్నీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ డయాలసిస్ యూనిట్‌కు సీఎస్ఆర్ఎంవోగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులను జారీచేశారు.



శ్రీకాకుళం: నీట మునిగిన వరి పంట





గార: వరి పంటకు మొలకలు వచ్చాయని ఆవేదన చెందుతున్న రైతు

చి'వరి'కి.. కన్నీరే

- వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు
- నీట మునిగిన పొలాలు..
- పంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

శ్రీకాకుళం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వాయుగుండం.. అన్నదాతల పాలిట వాయు 'గండం'గా మారింది. గత నాలుగు రోజుల నుంచి శనివారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షాల కారణంగా వరి పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో పండించిన వరి పంట చేతికి అందివచ్చిన సమయంలో.. వర్షాలు కురవడంతో తమకు చివరకు కన్నీరే మిగిలిందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షంతోపాటు ఈదురు గాలుల బీభత్సానికి ఉద్దానం ప్రాంతంలో కొంతమేర నష్టం జరిగింది. ఆ ప్రాంతాల్లో ఇంకా కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు నేలకు ఒరిగిపోయింది. ఇక శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వరకు పంటపొలాల్లో నిల్వ చేసిన వరి కుప్పలు తడిచి ముద్దయ్యాయి. పొలాల్లో నీరు నిల్వ చేరడంతో కోతకోసిన వరి కంకులు సైతం అక్కడక్కడా మొక్కలు మొలిచాయి. జిల్లా వ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో వ్యవసాయశాస్త్రవేత్తలతోపాటు.. జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు పలు ప్రాంతాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికి ప్రాథమికంగా నష్ట నివేదిక అందకపోవడం.. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంతో నష్టం ఎంతన్నదీ చెప్పలేమని వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి వెల్లడించారు. ఇదిలా ఉండగా.. రబీ సీజన్‌లో సాగుచేస్తున్న మినప, పెసలు పంటలు నీట మునిగాయి. ప్రస్తుతం వర్షం విడిచిపెట్టడంతో ఆదివారం నుంచి క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి.. పూర్తిస్థాయిలో నష్టాన్ని అంచనా వేయనున్నారు.



చైర్మన్, వైస్‌చైర్మన్లకు నియామక పత్రాలు అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట. చిత్రంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కూటమి నేతలు

సాగునీటి ప్రాజెక్టు సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

- రైతులకు సకాలంలో నీరందించేందుకు కృషి చేయాలి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట, ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి/ శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు సంఘాల ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా, ప్రశాంతంగా ముగిశాయి. శ్రీకాకుళంలోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఎన్నికలను వంశధార ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీరు పర్యవేక్షించారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, సాగునీటి ప్రాజెక్టుల సంఘాలకు చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బి.ఆర్.వంశధార ప్రాజెక్టుకు చైర్మన్‌గా నైరాకు చెందిన అరవల రవీంద్రబాబు, వైస్ చైర్మన్‌గా ఎల్.ఎన్.పేట మండలానికి చెందిన ఆనందరావు ఎంపిక య్యారు. అలాగే టీపీఆర్ నారాయణపురం ప్రాజెక్టు చైర్మన్‌గా సనపల ఢిల్లేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా పొన్నాడకు చెందిన పంచిరెడ్డి కృష్ణారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్.. ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు. రైతులకు సకాలంలో నీరందించేందుకు కృషి చేయాలని వారు సూచించారు. కాలువల ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని, అందుకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, పలువురు నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

కాలువల అభివృద్ధే లక్ష్యం..

ఆమదాలవలస: జిల్లాలోని నాగావళి, వంశధార నదుల పరిధిలో సాగునీటి కాలువల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని నూతనంగా ఎన్నికైన ప్రాజెక్టుల చైర్మన్లు అరవల రవీంద్రబాబు, సనపల ఢిల్లీశ్వరరావు తెలిపారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కృషి చేసిన కూటమి నేతలకు, రైతులకు కృతజ్ఞతలు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్‌తోపాటు ఎమ్మెల్యేలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

సుపారీ చెల్లించి.. హత్యకు యత్నించి..

- టీడీపీ నేతను హతమార్చేందుకు కుట్ర
- బీహార్ గ్యాంగ్‌ను రప్పించిన వైసీపీ నాయకులు
- భగ్నం చేసిన పోలీసులు
- ముగ్గురు బీహారీ వాసులు, నలుగురు వైసీపీ నేతల అరెస్టు
- రెండు నాటు తుపాకులు, తపంచా, 45 బుల్లెట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి.. ఇన్‌సెట్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకులు, తూటాలు, సెల్‌ఫోన్లు

పలాస, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు హత్యకు వైసీపీ నాయకులు కుట్ర పన్నారు. దీని కోసం బీహార్‌కు చెందిన ముఠాకు రూ.10 లక్షల సుపారీ చెల్లించి పలాస రప్పించారు. వారు రెక్కీ నిర్వహిస్తుండగా, పోలీసులకు సమాచారం అందడంతో ఈ హత్య కుట్రను భగ్నం చేశారు. ముగ్గురు బీహార్ వ్యక్తులతో పాటు నలుగురు వైసీపీ నాయకులను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు నాటు తుపాకీలు, ఒక తపంచా, 45 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను శనివారం మధ్యాహ్నం కాశీబుగ్గ పోలీస్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు.

మూడు నెలల కిందటే ప్రణాళిక

టీడీపీ పలాస-కాశీబుగ్గ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు స్వగ్రామం చిన్నబడాం. అదే గ్రామానికి చెందిన కూర్మాపు ధర్మారావు వైసీపీ నాయకుడిగా చలామణీ అవుతున్నాడు. ధర్మారావు అనుచరులుగా అదే గ్రామానికి చెందిన అంపోలు శ్రీనివాసరావు, హనుమంతు బాబూరావు, కోత శ్రీనివాసరావు, మందస మండలం జిల్లుండ గ్రామానికి రౌతు చంద్రశేఖర్ ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాగరాజు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. గ్రామానికి వైసీపీ నాయకులు ఆయనపై కక్షసాధింపునకు దిగారు. వ్యాపారాలను బంద్ చేయించారు. అలాగే రౌడీషీట్‌తో సహా మొత్తం పది కేసులు నమోదు చేయించారు. చివరకు ఆయన ఇంటిని సైతం కూల్చివేయడానికి సిద్ధమయ్యారు. అన్నింటినీ తట్టుకొని నాగరాజు నిలబడ్డాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నాగరాజు తనకు గతంలో జరిగిన అన్యాయాన్ని ఒక్కొక్కటిగా వెలికి తీయడం ప్రారంభించాడు. గ్రామానికి చెందిన వైసీపీ నేతలపై పోలీసులకు నేరుగా ఫిర్యాదులు చేశాడు. ధర్మారావు నిర్వహిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వ్యక్తిగత కక్షలతో నాగరాజు అడ్డుపడుతున్నాడని, ప్రతీదానికి తమను ప్రశ్నిస్తున్నాడని, అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని, ఆయన్ను అడ్డుతొలగించుకుంటే తమకు ఇబ్బందులు ఉండవని వైసీపీ నాయకులు భావించారు. ఈ మేరకు అక్టోబరులో చిన్నబడాం తోటల్లో ధర్మారావు, అంపోలు శ్రీనివాసరావు, బాబూరావు, కోత శ్రీనివాసరావు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నాగరాజును ఏ విధంగానైనా హత్య చేయాలని భావించారు. దీనికోసం బీహార్ రాష్ట్రానికి చెందిన సుపారీ గ్యాంగ్‌ను వినియోగించాలని పథకం రచించారు. ఈ మేరకు హనుమంతు బాబూరావు, పొన్నాడ కృష్ణారావు.. బీహార్ కిరాయి ముఠాను సంప్రదించారు. కొద్దిరోజుల కిందట విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో వారితో మంతనాలు జరిపారు. రూ.10లక్షలు సుపారీకి ఒప్పందం కుదుర్చుకొని నాగరాజును హత్య చేయాలని చెప్పారు.

రెక్కీ నిర్వహిస్తుండగా..

ఈ నెల 20న స్థానిక వైసీపీ నేతలు అంపోలు శ్రీనివాసరావు (చిన్నబడాం గ్రామం), రౌతు చంద్రశేఖర్ (మందస మండలం జిల్లుండ)తో పాటు, బీహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ ఇక్బాల్ రాజాఖాన్, ఎండీ అమీర్ (మిగతా 6వ పేజీలో...)

ఏపీపీగా శ్రీనివాసరావు

శ్రీకాకుళం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం మొదటి అదనపు జిల్లా కోర్టుకు ఏపీపీ(అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్)గా కింజరాపు శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈయన జిల్లాకు చెందిన న్యాయవాది. మూడేళ్ల కాలపరితితో ఏపీపీగా నియమిస్తూ రాష్ట్ర హోంశాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శనివారం ఉత్తర్వులను జారీచేశారు.



ప్రమాదానికి కారణమైన కారు

ఎమ్మెల్యే తనయుడి వాహనం ఢీకొని..

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్

8 లో



బోల్తా పడి నుజ్జయిన ఆటో

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే సహించం

- ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం
- కక్ష సాధింపు నా విధానం కాదు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హెచ్చరించారు. శనివారం టెక్కలిలో టీడీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. టెక్కలిలో వైసీపీ నాయకులు హుద్‌హుద్ కాలనీ ఇళ్లను రూ.5లక్షలు చొప్పున అమ్ముకున్నారని ఆరోపించారు. ఇప్పటికే జగతిమెట్ట సమీపంలోని కాలనీలో అక్రమాలు వెలికితీయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించామని తెలిపారు. ఏదో ఒకరోజు తానే స్వయంగా కాలనీ పరి శీలనకు వెళతానని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో తాను ఎన్నో ఇబ్బందులకు గురైనా.. ప్రస్తుతం కక్షసాధింపు తన విధానం కాదని తెలిపారు. ఎవరైనా తప్పుచేస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందన్నారు.

● ఒక్క రోడ్డు అయినా వేశారా?

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల ఒక్క బీటీ రోడ్డు, సీసీ రోడ్డు అయినా వేశారా? అని మంత్రి అచ్చెన్న ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.4,600 కోట్లతో ఊరూరా రోడ్లు వేస్తున్నామని తెలిపారు. ప్రతి రైతుకి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు అందిస్తామన్నారు. వైసీపీ నాయకులు ఇటీవల రైతు ధర్నా' అని ఎందుకు చేశారో వారికే తెలవదని ఎద్దేవా చేశారు. ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రైతుల నుంచి 21 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.4,860కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థని తిరిగి గాడిలో పెడుతున్నామని, అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా నడిపిస్తున్నామన్నారు.

తీరంలో నాలుగు లేన్ల రోడ్డుకు డీపీఆర్ సిద్ధం

'మూలపేట, భోగాపురం తీర ప్రాంతంలో నాలుగు లేన్ల రహదారికి డీపీఆర్ సిద్ధమైంది. పోర్టుకు అనుసంధానంగా పది వేల ఎకరాల్లో అనేక అనుబంధ పరిశ్రమలు, టూరిజం హబ్ రానున్నా యి. 2025 జూన్ నాటికి పోర్టుకి మొదటి షిప్ వచ్చేలా పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అలాగే కోటబొమ్మాళిలో జూనియర్ కళాశాల మంజూరుకు, నందిగాం జూనియర్ కళాశాల లో సౌక ర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటాం. జనవరి మొదటి వారం నుం చి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందించేందుకు కృషి చేస్తున్నామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు. సమావేశంలో నేతలు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, ఎల్ఎల్ నాయుడు, చాపర గణపతి, లవకుమార్, కామేసు, రాము, బుజ్జి, సూర్యనారాయణరెడ్డి, లాడి శ్రీనివాస్, గుజ్జారు సత్యం, ప్రసాద్‌రెడ్డి, పోలాకి షణ్ముఖరావు, మెండ దమయంతి, సుందరమ్మ ఉన్నారు.

వ్యాపారి ఇంట్లోకి చొరబడిన దొంగలు

- కత్తులతో బెదిరించి బంగారు ఆభరణాల చోరీకి యత్నం
- శ్రీకాకుళం నగరంలో కలకలం

8 లో

బస్సూ.. బస్సూ.. ఎప్పుడు వస్తావ్?

● అనేక గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు దూరం ● ప్రజలు, విద్యార్థులకు ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు


ఆర్టీసీ బస్సు

కంచిలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి)

ఓవైపు చిట్ట చివరి గ్రామాలకు సైతం ఆర్టీసీ బస్సు సేవలు అందిస్తామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మండల కేంద్రాలకు సమీపంలోని గ్రామాలకే బస్సు సర్వీసులు ఉండడం లేదు దీంతో అటు గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు నిత్యం పాఠశాలలు.. కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంచిలి మండల కేంద్రం సమీప గ్రామాలతో పాటు సుమారు 10 నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన ప్రాంతాలకు సైతం ఆర్టీసీ సేవలు అందడం లేదు.

అప్పట్లో రహదారులు లేవని...

కంచిలి మండలంలోని సుమారు 30 పంచాయతీలకు పూర్తిస్థాయిలో రహదారి సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ సేవలు మాత్రం అందడం లేదు. గతంలో రహదారులు లేవని... ఆక్యుపెన్సీ లేదని ఆర్టీసీ సర్వీసులు నడిపేందుకు అధికారులు సుముఖత చూపలేదు. ప్రస్తుతం మండల కేంద్రానికి సుదూరంగా ఉన్న గిరిజన గ్రామాలకు సైతం పూర్తిస్థాయిలో తారు రోడ్లు వేశారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు మండల పరిధిలో ఆర్టీసీ సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకోవడం లేదు. గంగాధరపురం, భైరిపురం, జలంత్రకోట, గోకర్ణపురం, శాసనాం, ఉద్దానంలోని పెద్దశ్రీరాంపురం, పెద్దకొజ్జిరియా, శిలగాం తదితర గ్రామాలకు పూర్తిస్థాయిలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్న సర్వీసులు అంతంతే..

మండల కేంద్రం కంచిలి నుంచి సుదూరంలో ఉన్న ఎంఎస్‌పల్లి, గంగాధరపురం గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నప్పటికీ అరకొరగానే సేవలు అందుతున్నాయని ఆ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి మాత్రమే బస్సులు నడుపుతుండటంతో విపరీతమైన రద్దీగా ఉంటోందని, మరిన్ని సర్వీసులు పెంచాలని వారు కోరుతున్నారు. అంతేకాకుండా మిగిలిన సమయాల్లో బయటి ప్రాంతాలకు వెళ్లాలన్నా... బయటి నుంచి గ్రామాల్లోకి రావాలన్నా అవస్థలు తప్పడం లేదని చెబుతున్నారు. పెద్దశ్రీరాంపురం రూట్‌లో ఒక సర్వీసు నడుపుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో తిరగడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. జలంత్రకోట పంచాయితీ పరిధిలోని నువ్వాగడ, పరిసర గ్రామాలకు సైతం బస్సు సర్వీసులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

బస్సుల వేళలతోనూ ఇబ్బందులే

కొన్ని గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నారు. కంచిలి మండల కేంద్రంలోని పాఠశాలలు, కళాశాలలు ప్రతి రోజు ఉదయం 9 గంటలకు తెరుచుకుంటాయి. అయితే ఘాటి గ్రామం నుంచి ఆర్టీసీ బస్సు ఉదయం 9 గంటలకు బయలుదేరుతుంది. అది కంచిలి చేరుకునేసరికి 10 గంటలు అవుతుంది. ఈ బస్సుపై ఆధారపడిన విద్యార్థులు సరైన సమయానికి తరగతులకు హాజరు కాలేకపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేబీనౌగాం రూట్‌లో బస్సు ఉదయం 8.30 గంటలకు బయలుదేరినా... కంచిలికి 9.50కి చేరుతుంది. ఇలా ఉన్న రెండు బస్సులు తిరిగే వేళలు విద్యార్థులకు ఇబ్బందికరంగానే ఉన్నాయి. సాయంత్రం కళాశాల నుంచి తిరిగి వచ్చేటప్పుడు సైతం ఆర్టీసీ సేవలు అందడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. తమ కళాశాలలు, పాఠశాలలు సాయంత్రం 5 గంటలకు విడిచి పెడుతుంటే కంచిలిలో ఘాటి బస్సు 4 గంటలకే బయలుదేరిపోతుందని వారు తెలిపారు. వందలాది మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సు పాసులు కొనుక్కుంటున్నప్పటికీ వేళలు కుదరక, అదనపు డబ్బులను ఆటోలకి వెచ్చించి... కళాశాలలకు వెళుతున్నారు. సాయంత్రం ఇళ్లకు చేరేసరికి చీకటి పడుతుండడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో ఆటోల్లో ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణాలు సాగిస్తున్నారు. గిరిజన గ్రామాలైన బొగాబెణి, జెన్నాఘయి, నువ్వాగడ కాలనీల వైపు వెళ్లాలంటే ఆటోలే శరణ్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల పరిధిలోని అధిక గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా ఆర్టీసీ సర్వీసులు నడపాలని వారంతా కోరుతున్నారు.

బస్సులు రావడం లేదు



మా ఊరి వైపు నుంచి సుమారు 30 నుంచి 40 మంది విద్యార్థులు రోజూ కంచిలి కళాశాలకు వెళుతుంటాం. మా ఊరి వరకు తారు రోడ్డు ఉంది. కానీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో ఎంఎస్‌పల్లి వరకు సైకిల్‌పై వచ్చి, బస్సు ఎక్కాల్సి వస్తోంది.

-ప్రవీణ్ పాణిగ్రాహి, ఇంటర్ విద్యార్థి, కొనక

వేళకు హాజరు కాలేకపోతున్నాం..



బస్సులు సరైన సమయానికి లేకపోవడంతో రోజూ తరగతులకు ఆలస్యంగానే వెళ్లాల్సి వస్తోంది. దీని వల్ల పాఠాలు సరిగా వినలేకపోతున్నాం. ఎంతో కష్టపడి వెళ్లినా... సకాలంలో తరగతులకు హాజరుకాలేని పరిస్థితి ఉంది.

-దివాకర్ కదువ, ఇంటర్ విద్యార్థి, ఘాటి

తల్లిదండ్రుల్లో ఆందోళన..



ఉదయం కళాశాలకు వెళ్లేటప్పుడు ఆలస్యమవుతోంది. కళాశాల విడిచిపెట్టినా, బస్సుల కోసం వేచి చూసి... ఇంటికి చేరే వరకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బస్సుల సంఖ్య పెంచడమే కాకుండా, విద్యార్థులకు అనుకూలమైన వేళల్లో నడిపితే బాగుంటుంది.

-పూజా ప్రధాన్, ఇంటర్ విద్యార్థిని, సాగర నౌగాం


కొర్రాయి గేటు వద్ద నిలిచిన రైలు

పట్టాలపై పట్టు దొరక్క ఆగిన గూడ్సు రైలు

హరిపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టాలపై పరుగులెత్తాల్సిన రైలు పట్టు దొరక్క నిలిచిపోయిన ఘటన కొర్రాయి గేటు-రంగోయి గేటు వద్ద శనివారం చోటుచేసుకుంది. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పట్టాలపై రైలు చక్రాలకు పట్టు దొరకలేదు. దీంతో ముందుకు సాగక నిలిచిపోయింది. రైలు ఎందుకు నిలిచిందో హరిపురం (మందస రోడ్) రైల్వే స్టేషన్ అధికారులకు తెలియక కొద్దిసేపు ఏం జరిగిందోనని ఆందోళన చెందారు. అయితే రైలు సిబ్బంది నుంచి సమాచారం అందడంతో ఉన్నతాధికారుల సూచనలతో లోకో పైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్, గార్డులు రైలు దిగారు. పట్టాలపై ఇసుక, చిన్న చిప్స్ గుండవేసి అతికష్టం మీద ముందుకు నడిపించారు. దీంతో సుమారు రెండు గంటల అనంతరం రైలు ముందుకు కదలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సుపారీ చెల్లించి.. హత్యకు యత్నించి..

(ఐదో పేజీ తరువాయి)

రెండు ద్విచక్ర వాహనాలపై తుపాకీలు, కంట్రిమేడ్ రివాల్వర్‌తో వచ్చి నాగరాజు నివాసం వద్ద రెక్కీ నిర్వహించారు. తాము అనుకున్న హత్య పథకాన్ని అమలు చేయడానికి వేచి ఉన్నారు. ఈ క్రమంలో పోలీసులకు విశ్వసనీయవర్గాల ద్వారా సమాచారం అందింది. దీంతో కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఆ నలుగుర్ని పట్టుకున్నారు. వారి నుంచి రెండు తుపాకీలు, ఒక తపంచా, 45 రౌండ్ల బుల్లెట్లు, ఒక కారు, మూడు దొంగిలించిన ద్విచక్ర వాహనాలు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు వైసీపీ నేతలు కూర్మాపు ధర్మారావు, కోత శ్రీనివాస రావుతోపాటు బీహార్‌కు చెందిన మరో వ్యక్తి నిరంజన్ కుమార్‌పాశ్వాన్.. కోసంగిపురం వద్ద ఓ అద్దె ఇంటిలో తలదాచుకోగా వారిని కూడా అరెస్టు చేశారు. మరో 10 మంది వ్యక్తులపై అభియోగాలు ఉన్నాయని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ వెల్లడించారు.

వేగంగా స్పందించి.. నిండు ప్రాణం కాపాడి

ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మారావు, ఆయన అనుచరుల కదలికలపై క్రైమ్, టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక పోలీసులు, సాంకేతిక బృందం ప్రత్యేకంగా విడిపోయి నిఘా పెట్టారు. దీంతో నిందితులను సకాలంలో పట్టుకోవడంతో పాటు పక్కా ఆధారాలు కూడా సేకరించారు. వారి కార్యకలాపాలు అనుమానంగా ఉండడంతో పోలీసులు వేగంగా స్పందించి ఓ నిండు ప్రాణాలను కాపాడారంటూ పోలీసులను ఎస్పీ అభినందించారు. వారికి త్వరలోనే రివార్డులు అందిస్తామని తెలిపారు.

మాజీమంత్రి పాత్రపై అనుమానాలు..

టీడీపీ నేత నాగరాజు హత్యకు కుట్రపన్నారనే అభియోగంపై కొన్ని రోజుల కిందట ఇద్దరు వైసీపీ నాయకులను కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై మాజీమంత్రి సీదిరి అప్పలరాజు, ఆయన అనుచరులు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్ద హంగామా చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఓ మీడియా ప్రతినిధి ఎస్పీని ప్రశ్నించగా.. ఆందోళన చేయడం సరైంది కాదని, చట్టం తన పనితాను చేసుకుపోతుందన్నారు. దీంతో వైసీపీ నాయకుల్లో ఆందోళన మొదలైంది. నాగరాజు వ్యవహారంలో ఇంకా 10 మంది వరకూ వైసీపీ కార్యకర్తలు ఉన్నారనే ప్రచారం జోరందుకోవడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ జాబితాలో తమ పేర్లు ఎక్కడ ఉంటాయోనని వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. కాగా, ఈ ప్రాంతానికి పరిచయం లేని బీహార్ సుపారీ గ్యాంగ్‌ను ఆ రాష్ట్రానికి వెళ్లి కలిసిన వ్యక్తి ఎవరు? అనేదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆయన పలాసకు చెందిన వ్యక్తిగా ఇప్పటికే గుర్తించారు. ఆయన్ను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను పంపించారు.



మంటలు కావవి.. సూర్యుడి వెలుగులు!

టెక్కలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంది. శనివారం మధ్యాహ్నం వరకు వర్షం కురుస్తూనే ఉంది. సాయంత్రానికి కాస్త తెరిపినిచ్చింది. ఉన్నట్టుండి ఆకాశంలో మంటలు రేగినట్టు ఓ దృశ్యం ఆవిష్కృతమైంది. మబ్బుల చాటున సూరీడు మంటలు చిమ్ముతున్నట్టు కనిపించిన దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

● మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయ్యింది. హనీమూన్ పీరియడ్ ముగిసింది. ఇక క్షేత్ర స్థాయిలో కార్యకర్తలతో కలిసి అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వివిధ శాఖల అధికారులకు సూచించారు. శనివారం టెక్కలిలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ, మండలపరిషత్, రెవెన్యూ తదితర శాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అవసరమైన చోట తారు రోడ్లు, సీసీ రోడ్లు వేయించాలన్నారు. పల్లెపండగలో ఇంకా 80 పనులు పెండింగ్‌లో ఉండడం ఏంటంటూ పీఆర్ అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఎక్కడ పనులు ప్రారంభం కాలేదో వివరాలు తెలియజేయాలని, ఇప్పటివరకు 30శాతానికి మించి ఎందుకు జరగలేదో చెప్పాలని ఈఈ సూర్యప్రకాష్, డీఈఈ సుధాకర్‌ను ప్రశ్నించారు. పనులు నత్తనడకన జరుగుతున్నాయని.. అది సరికాదని స్పష్టంచేశారు. గ్రామాల్లో జరిగే సీసీ రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలని, అద్దాల్లా మెరవాలన్నారు. టూరిజం పనులకు ఈనెల 30న శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టెక్కలి నియోజకవర్గంలో 137 పంచాయతీల్లో ఏ గ్రామానికి ఏ పని అవసరమో గుర్తించి ప్రతిపాదనలు అందించాలన్నారు. టెక్కలిలో వేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రోడ్డు సేఫ్టీ త్రెడ్ లైటింగ్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. సీసీ, బీటీ రోడ్లు వేస్తున్న చోట విద్యుత్ పోల్స్ అడ్డంగా ఉంటే తొలగించాలని ఈఈ శంకరరావుకు సూచించారు. అలాగే ప్రజల నుంచి వినతులు స్వీకరించి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు.

అన్నదాతకు అంతులేని కష్టం!

● ఎడతెరిపిలేని వర్షాలతో నష్టం ● నీట మునిగిన వరి ● కొన్నిచోట్ల మొలకలు ● కళ్లాలకు చేర్చినా కాపాడుకోలేని దైన్యం


గార: తడిసిన వరి చేలను చూపిస్తున్న రైతు


మెళియాపుట్టి: బస్తా నుంచి నీరు కారుతున్న దృశ్యం


సోంపేట : పలాసపురంలో తడిసిన వరిపంటను చూపుతున్న రైతు


కంచిలి: ముండల గ్రామంలో..


జలుమూరు: తడిసిన ధాన్యాన్ని చూసుకుంటున్న రైతులు


పలాస రూరల్: హిమగిరి ప్రాంతంలో తడిసిన వరి

(ఆంధ్రజ్యోతి బృందం)

అన్నదాతను మరోసారి ప్రకృతి దగా చేసింది. పంట ఇంటికి చేరుతుందనుకున్న వేళ అల్పపీడనం రూపంలో దాడి చేసింది. ఏకధాటిగా నాలుగు రోజులుగా కురిసిన వర్షాలతో నిండా ముంచేసింది. నిన్నమొన్నటి వరకు పచ్చగా ఉన్న పంటను చూసి మురిసిపోయిన రైతన్న... ఇప్పుడు నీటిలో ఉన్న పంటను చూసి కన్నీరుమున్నీరవుతున్నాడు. పంటను రక్షించుకునే మార్గం లేక... పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తల్లడిల్లుతున్నాడు. కొన్నిచోట్ల పంట.. పొలాల్లోనే నెలకొరిగింది. మరికొన్ని చోట్ల నీట మునిగింది. ఇంకొన్ని గ్రామాల్లో కోసి..కుప్పలుగా పెడితే.. పూర్తిగా నీటిలో తడిసిపోయాయి. అనేక చోట్ల నూర్పులు పూర్తయినప్పటికీ కళ్లాల్లోనే ధాన్యం వదిలేశారు. ఆ ధాన్యం కూడా నీట మునిగాయి. చాలా గ్రామాల్లో పొలాల్లోనే మొలకలు వస్తున్నాయి. ఇలా చేతికి అందివచ్చిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాతలు దీనంగా విలపిస్తున్నారు. ఇంకోవైపు రబీ పంటలైన పెసర, మినుము నీట మునిగాయి. వర్షాలతో దెబ్బతిన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కర్షకులు వేడుకుంటున్నారు.


ఎల్.ఎన్.పేట: తురకపేట సమీపంలో నీటిలో మునిగిన పెసర పంట


ఇచ్ఛాపురం: నేలకొరిగిన వరి


హరిపురం: కొండలోగాం వద్ద నీట మునిగిన కంది పంట..


నరసన్నపేట: దేవాది-పసరవానిపేట వద్ద ఓదెలను ఆరబెడుతున్న రైతు


పోలాకి: కళ్లాల్లో వరి కుప్పలపై పరదాలు కప్పిన దృశ్యం


కవిటి: నీటిలో ఇలా..


లావేరు: సుభద్రాపురంలో..

బీఈడీ, డీపీఈడీ, పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో బీఈడీ, డీపీఈడీ, పీజీ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థుల రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శనివారం విడుదల చేసినట్టు ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. బీఈడీ కోర్సులో 282 మంది విద్యార్థులు హాజరుకాగా 279 మంది, డీపీఈడీ కోర్సులో 46కు శతశాతం మంది ఉత్తీర్ణతులయ్యారు. పీజీ 19 కోర్సుల్లో మొత్తం 469 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 400 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గుజరాతీపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్‌లో పరీక్ష రాసేందుకుగాను ఫీజుకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేస్తున్నట్టు డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. పదో తరగతికి సంబంధించి ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియట్ పరీక్ష సబ్జెక్టుకు రూ.150 చొప్పున అపరాధ రుసుం లేకుండా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 23 నుంచి 31వ తేదీ వరకు గడువు నిర్ణయించినట్టు పేర్కొన్నారు. అపరాధ రుసుంతో సబ్జెక్టుకు అదనంగా రూ.25 చెల్లించి జనవరి 4వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో 8వ తేదీ లోగా చెల్లించాలన్నారు. అదేవిధంగా తత్కాల్ రుసుంతో పదో తరగతికి సబ్జెక్టుకు రూ.500 చొప్పున, ఇంటర్మీడియట్ సబ్జెక్టుకు రూ.1000 చొప్పున 10వ తేదీలోగా చెల్లించాలన్నారు. ఈ ఫీజును మీసేవ కేంద్రం, ఏపీ ఆన్‌లైన్‌లో మా త్రమే చెల్లించాలని స్పష్టం చేశారు.

ధ్యానంతో ఆరోగ్యకర సమాజం

అరసవల్లి/శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో తీవ్ర ఒత్తిడుల మధ్య ప్రజలు జీవిస్తున్నారని, దాని నుంచి విముక్తి పొంది ప్రశాంతమైన, ఆనందకర జీవనాన్ని సాగించాలంటే ధ్యానం ఒక్కటే మార్గమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, నగర పాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, వైద్యుడు అమ్మన్నాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బ్రహ్మకుమారీల ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల వీధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని మాట్లాడారు. స్పోర్ట్స్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఏపీ ఉపాధ్యక్షుడు మురళీధర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది'

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆరోపించారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శనివారం కృష్ణదాస్ అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూడా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరుకాకపోవడంతో.. ఇక ధర్మాన వైసీపీకి దూరమైనట్టేనని ఆ పార్టీ నాయకులు గుసగుసలాడుతుండం విశేషం.

ఆలయ అభివృద్ధికి సాయం

రణస్థలం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం, సంచాం గ్రామాల మధ్య వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయం అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన వినోద్ రూ.1,85,000 ఆర్థిక సాయం చేశారు. ఇటీవల ఆయన ఈ దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ అవసరాలను ఆలయ ధర్మకర్త ఆకెళ్ల ఫణి శర్మను అడిగి తెలుసుకున్నారు. వినోద్‌ను గ్రామ పెద్దలు రౌతు శ్రీనివాసరావు, వద్దాది శ్రీనివాసరావు, వెంకటరమణ, హోటల్ ప్రసాద అభినందించారు.

ఘనంగా గణిత దినోత్సవం



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

ఇచ్ఛాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాల ఆవరణలో రామానుజం చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయులు జ్యోతి, రేణుక, చంద్రవదనలను సత్కరించారు. విద్యార్థులు గణిత ఈక్వేషన్ రూపంలో కూర్చొని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, పద్మావతి, అమిత, మినుచంద్ర, స్వప్నరాణి, తదితరులు పాల్గొన్నారు.

● కవిటి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గణిత దినోత్సవం సందర్భంగా కవిటిలో శనివారం టాలెంట్ టెస్టు నిర్వహించారు. విజేతలకు ఎంఈవోలు ధనుంజయ మజ్జి, కె.చిట్టిబాబు బహుమతులను అందించారు.

● పొందూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం గణిత పోటీలను నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం బి.కంఠయ్య, ఇన్‌చార్జి హెచ్ఎం జి.సాయికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులంలో క్రిస్మస్ వేడుకలు

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పెద్దపాడు గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎస్ రంగమణి ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్‌కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఉపాధ్యాయులు ఐశ్వర్య, భవానీ, లక్ష్మి, హారతి, ఉమాకుమారి, మల్లేశ్వరి, ధనలక్ష్మి, హైమావతి, జయశ్రీ, పుష్పవేని, లావణ్య పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు ఒక వైపు వర్షం కురుస్తుండగానే పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి బాలబాలికలు క్రీడాకారులు పాల్గొనగా, అండర్-16 క్రీడాకారులకు రెండు కిలోమీటర్లు, అండర్-18 క్రీడాకారులకు ఆరు కిలోమీటర్లు, అండర్-20 క్రీడాకారులకు ఎనిమిది కిలోమీటర్ల పరుగు, పురుషులు, మహిళలకు పది కిలోమీటర్ల పరుగు పందేన్ని నిర్వహించారు. ఇందులో ఎంపికైన వారు జనవరి 5న తణుకులో జరగనున్న రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి తెలియజేశారు. పోటీలు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, జిల్లా పాఠశాలల క్రీడల సంఘం సంయుక్త కార్యదర్శి కె.మాధవరావు తదితరుల పర్యవేక్షణలో జరిగాయి.



కవిటి: నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్



ఇచ్ఛాపురం: డొంకూరు వద్ద ఒరిగిన వరిచేను పరిశీలిస్తున్న అధికారులు

రైతులను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే బెందాళం అశోక్



రణస్థలం: తడిచిన వరిని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కవిటి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కవిటిలో నీటమునిగిన వరి చేలను ఆయన శనివారం పరిశీలించారు. అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాల తో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలిందన్నారు. నియోజ కవర్గంలోని అన్ని మండలాల వ్యవసాయాధికారులతో చర్చించి పంట నష్టం అంచనా వేయాలని కోరామన్నారు. వ్యవసాయశాఖ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ధాన్యం రంగుమారినా కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలి

జి.సిగడాం/రణస్థలం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి పర్యటించారు. వర్షానికి తడిసిన వరి పనలు మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో ఎర్రా శారద, వీఏఏ ముంతా హేమంత్‌కుమార్, సర్పంచ్ చిత్తిరి మోహన్, రైతులు ఉన్నారు. అలాగే, జాడ, జగన్నాథవలస, బాతువ తదితర గ్రామాల్లో తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఏవో శారద పర్యటించారు. రైతులతో మాట్లాడి పంట రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ● రణస్థలం మండలంలోని కమ్మసిగడాం, వేల్పురాయి, కొండములగాం గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి పర్యటించారు. రైతులకు సూచనలు చేశారు. శాస్త్రవేత్త ఉదయబాబు, ఏవో విజయభాస్కర్, రైతులు పాల్గొన్నారు.

ఎండబెట్టి నూర్చుకోవాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బూర్జపాడు, బెల్లుపడ, ధర్మపురం గ్రామాల్లో నేలకొరిగిన వరి చేలను వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.జగన్మోహన్‌రావు, వ్యవసాయాధికారిణి టి.భార్గవి శనివారం పరిశీలించారు. పొలంలో నీరు నిలిచి ఉంటే పనలను గట్లపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలని తెలిపారు. ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలని సూచించారు.

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో ముమ్మరంగా గస్తీ విధులు నిర్వహించి నేరాల నియంత్రణపై దృష్టిసారించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. శనివారం రూరల్ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. ప్రతీ రోజూ విజబుల్ పోలీసింగ్ నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలని, అసాంఘిక కార్యకళాపాలు నియంత్రణకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఐ కె.రాము ఉన్నారు.

మాతృ మరణాలు లేకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాతృ మరణాలు సంభవించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఇటువంటి కేసులను ముందుగానే గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి, డీసీహెచ్ఎస్ కల్యాణబాబు, డీపీఎన్‌హెచ్ఎన్‌వో శైలజ, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

వినియోగదారులను మోసగిస్తే శిక్ష తప్పదు

ఆమదాలవలస, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వస్తువుల సేవలో గాని, వాటి నాణ్యత, ధరలో వినియోగదారుని మోసగిస్తే శిక్ష తప్పదని మండల వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు టి.ధనుంజయరావు అన్నారు. శనివారం జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని లక్ష్మీనగర్, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన వినియోగదారుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై నిర్వహించిన వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. హెచ్ఎం బొడ్డేపల్లి రామకృష్ణ ఉన్నారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత



ధ్యానం చేస్తున్న డైరెక్టర్ బాలాజీ తదితరులు

ఎచ్చెర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ధ్యానంతోనే మానసిక ప్రశాంతం కలుగుతుందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. స్థానిక క్యాంపస్‌లో శనివారం యోగా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్యాన దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహనకృష్ణ చౌదరి, యోగా విభాగాధిపతి డాక్టర్ కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల క్లెయిమ్స్ పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల క్లెయిమ్స్‌పై సూపర్ చెక్ కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం తన కార్యాలయంలో నిర్వహించారు. గడచిన ఎన్నికల్లో ఫారం 6, 7, 8 క్లెయిమ్స్‌కు సంబధించి, భారత ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన 23 దరఖాస్తులను ఆయన స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో సీ-సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ఎచ్చెర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ విద్యార్థులు శనివారం నిరసన తెలిపారు. హోంమంత్రి తన పదవికి రాజీనామా చేసి, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వర్సిటీ అధ్యాపకులు ఎం.రవికుమార్, ఎం.చినసుబ్బారావు, వై.రాజేంద్ర ప్రసాద్, ఎం.ప్రకాశరావు, బి.కాటన్‌రాజు, కె.ఉదయకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ దురుద్దేశాలు లేవు'

కంచిలి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ పల్లి పంచాయతీ సర్పంచ్ కొనపల సురేష్‌కుమార్‌తో మాకు ఎటువంటి రాజకీయ విభేదాలు లేవని కూటమి నాయకులు అన్నారు. అభివృద్ధి పేరుతో 2021-24 వరకు పంచాయతీ పరిధిలో జరిగిన అవకతవకలపైనే తాము ఫిర్యాదు చేశామన్నారు. ప్రజల సమక్షంలో అధికారులు విచారణ చేసి అవకతవకలు జరిగాయని నిరూపించిన తర్వాతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇంత జరిగినా రాజకీయ కక్ష సాధింపు అనడం సరికాదన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

ఎచ్చెర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం) ఎలక్ట్రికల్ విభాగాధిపతి జీటీ చంద్రశేఖర్ అన్నారు. ఈ కళాశాలలో శనివారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ ఆదాపై నిర్వహించిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్, సోలార్ సైకిల్, పోస్టర్ ప్రజెంటేషన్లతో విజేతలకు బహుమతులను ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాయి మార్గంతో సత్ప్రవర్తన

పొందూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సాయి మార్గంతో సత్ప్రవర్తన అలవడుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సత్యసాయి ఆలయంలో శనివారం నిర్వహించిన సర్వధర్మ స్తూపం, ముఖద్వారం ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, పొందూరు శాఖ అధ్యక్షుడు దున్నా రాధారాకృష్ణ, పి.నానాజీ తదిరులు పాల్గొన్నారు.

అలరించిన 'సుస్వర లహరి'

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బాపూజీ కళామందిర్‌లో శనివారం జరిగిన సుస్వర లహరి కార్యక్రమం ఆకట్టుకుంది. గాయకులు భాస్కరరావు, మార్గదర్శి శ్రీను, చౌదరి శ్రీనివాసరావు, పెంకి నాగేశ్వరరావు తదితరులు గేయాలు ఆలపించారు.

అప్రమత్తంగా ఉండాలి

గారు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దనరావు అన్నారు. శనివారం రాత్రి శాలిహుండం కేజీబీవీలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

అరసవల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎటువంటి ఆధారంలేని నిరాశ్రయులకు అరసవల్లికి చెందిన ఇంజరాపు మోహనరావు అండగా నిలిచారు. శుక్రవారం రాత్రి నగరంలోని పాతబస్టాండ్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, దేవాలయాల వద్ద, రోడ్డు పక్కన గల దుకాణాల వద్ద నిద్రిస్తున్న సుమారు 100మందికి దుప్పట్లు అందించారు. బత్తి లి రమేష్, జాడ సాయి, ఉమాశంకర్, చరణ్ పాల్గొన్నారు.

న్యాయం చేయండి

కంచిలి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిచిన ధాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అధ్యక్షత మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీడీవో వి.తిరుమలరావు, తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్ ఎంఈవోలు పాల్గొన్నారు.

ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం వెంటనే కల్పించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళలకు ఫ్రీ బస్ పథకం అమలుపై కూటమి ప్రభుత్వానికి కాలయాపన తప్ప ఇచ్చిన హామీ నిలబెట్టుకునే బాధ్యత కనిపించడం లేదన్నారు. నూతన సంవత్సరంలో నైనా మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టు కోవాలన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘ కార్యవర్గం

లావేరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల సచివాలయ ఉద్యోగల సంఘం కార్యవర్గ ఎన్నికలు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగాయి. సంఘ అధ్యక్షుడిగా బలివాడ రాజశేఖర్ (వెల్ఫేర్ అసిస్టెంట్), ఉపాధ్యక్షుడిగా తాలాడ లక్ష్మణ్ (అగ్రికల్చర్ అసిస్టెంట్), ప్రధాన కార్యదర్శిగా కెల్ల జగన్(వీఆర్‌వో), కోశాధికారిగా టి.గౌరీశంకర్ (డిజిటల్ అసిస్టెంట్), సహాయ కార్యదర్శిగా ఎల్.యమునారాణి (మహిళా సంరక్షణ కార్యదర్శి) అర్గనైజింగ్ కార్యదర్శులుగా వై.తేజేశ్వరరావు (సర్వేయర్), వి.జోగారావు (జేఎల్ఎం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

భగవద్గీత శ్లోక పోటీల విజేతలకు బహుమతులు

ఇచ్ఛాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ క్లబ్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భగవద్గీత శ్లోకా పోటీలకు విశేష స్పందన లభించింది. జూనియర్ విభాగంలో బి.కావ్య, ఉప్పాడ కుసుమ, ఎస్.నివాస్, సీనియర్స్ విభాగంలో జి.అరుణ, కె.బేబీరాజు, జి.రమ్య ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి బహుమతులు అందజేశారు. ఎంఈవో కె.అప్పారావు, రామ్‌ప్రసాద్, జోహర్‌ఖాన్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాక తులసీదాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత యోగా పోటీలకు ఎంపిక

ఎచ్చెర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): భువనేశ్వర్‌లోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ యూనివర్సిటీలో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు జరగను న్న అఖిల భారత యోగా పోటీల్లో బీఆర్ఏయూ తరఫున పాల్గొనే యోగా బృందాలను శనివారం ఎంపిక చేశారు. పురుషుల, మహిళల కేటగిరీలకు ఈ ఎంపికలు జరిగాయి. ఈ బృందాన్ని వీసీ కేఆర్ రజని అభినందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత, స్పోర్ట్స్ డీన్ పి.రవికుమార్, కేవీఎన్ మూర్తి పాల్గొన్నారు.

త్రివేణి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల కోటబొమ్మాళి మండలం పాకివలస వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు సంపతిరావు త్రివేణి కుటుంబాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ పరామర్శించారు. శనివారం పురపాలక సంఘంలోని ఒకటో వార్డు తిమ్మాపురంలోని ఆమె స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ తరఫున కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. టీడీపీ మురళి, అమ్మినాయుడు, పవన్ ఉన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో ఐఆర్ఎస్ అధికారి

గార, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలోని కూర్మనాథుని శనివారం బెంగళూరుకు చెందిన ఐఆర్ఎస్ అధికారి యామిని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి చిత్రప టాన్ని, ప్రసాదాన్ని ఈవో గురునాథరావు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సీతారామ నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తనయుడి వాహనం ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలు

- శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్
- పరామర్శకు వచ్చి వెళుతుండగా గాయపడిన లివిరి గ్రామస్థులు



గాయపడిన ఆటోడ్రైవర్ కూర్మాన సునీల్, గణేష్, చొప్ప జోగయ్య, సంతోషి

పాతపట్నం డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు తనయుడి వాహనం ఆటోని ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరందరినీ శ్రీకాకుళం రిమ్స్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటన శనివారం కొరసవాడ గ్రామ సమీపంలో సంభవించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం నుంచి పాతపట్నం వెళుతున్న ఎమ్మెల్యే ఎంజీఆర్ తనయుడు సాయిగణేష్ వాహనం అతివేగంగా వస్తూ కొరసవాడ గ్రామ సమీపంలో పాతపట్నం నుంచి సీది వెళుతున్న ఆటోను బలంగా ఢీకొనడంతో ఆటో బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. ఆటో నుజ్జు నుజ్జు కావడంతో అందులో ప్రయాణిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెంది న సవలాపురం నరేష్, గణేష్, చొప్ప జోగయ్య, చొప్ప సంతు (మహిళ)తో పాటు ఆటో డ్రైవర్ కూర్మాన నవీల్ పురింజకు తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా పాతపట్నం శివశంకర్ కాలనీలో సమీప బంధువు మృతి చెందిన నేపథ్యంలో పరామర్శకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా ఆ వాహనంలో క్షతగాత్రులను పాత పట్నం సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు ప్రాథమిక వైద్య సేవలందించారు.

అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనలో వాహనంలోని బెలూన్ ఓపెన్ కావడంతో ఎమ్మెల్యే తనయుడు ప్రమాదం నుంచి బయటపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు వాహనం డ్రైవర్ పల్లి రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి.రామారావు తెలిపారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

హరిపురం, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురం (మందస రోడ్) రైల్వే స్టేషన్ పరిధిలోని మఖరజోల వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం శనివారం లభ్యమైనట్లు జీఆర్పీ ఎస్ఐ ఎస్కే షరీఫ్ తెలిపారు. మృతురాలి వయసు సుమారు 55 ఏళ్లు ఉంటుందని, బిస్కెట్ కలర్ జాకెట్, డార్క్‌పింక్ బార్డర్, లైట్ పింక్ రింగ్స్‌తో చింతపిక్క కలర్ చీర కట్టుకుని ఉందని చెప్పారు. ఏదైనా రైలు నుంచి జారిపడటంతో తలకు బలమైన గాయాలై మృతిచెంది ఉంటుందని అనుమానిస్తున్నారు. పలాస సీహెచ్‌సీ మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు, వివరాలకు 94406 72567 నంబరులో సంప్రదించాలని కోరారు.

పలాస జీఎస్టీవోగా పురుషోత్తంనాయుడు



పురుషోత్తంనాయుడును అభినందిస్తున్న ఎన్జీవో సంఘ నేతలు

కాశీబుగ్గ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పలాస సర్కిల్ గూడ్స్ అండ్ సర్వీసు ట్యాక్స్ అధికారి (జీఎస్టీవో)గా చౌదరి పురుషోత్తంనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను, పథకాలను ప్రజలకు చేరేలా విధులు నిర్వహిస్తానన్నారు. ఈయన ఏపీఎన్జీవోఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను సంఘం జిల్లా అధ్యక్షుడు హెచ్. సాయిరాం, పలాస ఎన్జీవో అధ్యక్షుడు బోనెల గోపాల్ తదితరులు అభినందించారు.

ఐతమ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పూర్వ విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ తదితరులు

టెక్కలి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల (ఐతమ్)కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం కళాశాలలో నిర్వహించారు. వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన వారు, స్టార్టప్, ఇతర రంగాల్లో స్థిరపడిన వారంతా ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పాటు అందించాలని కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు కోరారు. విద్యార్థుల విజయమే ఐతమ్ విజయమని, పూర్వ విద్యార్థులే కళాశాలకు వెన్నెముక అని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, అల్యూమినీ కో-ఆర్డినేటర్ డాక్టర్ యుగంధర్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ కుమార్‌లు ఉన్నారు.

బిల్లును అడిగి తీసుకోవాలి

హిరమండలం, డిసెం బరు 21 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు చేసిన వస్తువుకు బిల్లు అడిగి తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ కె.రాజారమేష్ అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక కేజీబీవీలో జిల్లా తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శంకర విశ్వేశ్వరరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కార్యదర్శి ఏవీ సురేష్, ప్రత్యేకాధికారి ఎస్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపు



రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ హనుమంతురావు

హిరమండలం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హిరమండలం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గోతుల మయమైన ప్రధాన రహదారిని బాగు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో వర్షపునీరు నిలిచి ప్రమాదకరంగా తయారవడంతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'చెరువును తలపించిన రహదారి' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచనల మేరకు నీరు వెళ్లేందుకు వీలుగా రెండు ఎక్స్‌కవేటర్లతో రోడ్డుకు ఉన్న ఆక్రమణలు తొలగించారు. గోతులను తాత్కాలికంగా పూడ్చివేశారు. తహసీల్దార్ హనుమంతురావు, ఆర్అండ్‌బీ ఏఈ గోపాలరావు, ఈఓ హరికృష్ణ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం



కాలువలోని పూడికను తొలగిస్తున్న స్థానికులు

టెక్కలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): టెక్కలి పట్టణంలో పారిశుధ్య పనుల్లో పంచాయతీ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాలువల్లో పూడికలు నిండి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో స్థానికులే పూడికలు తొలగించే చర్యలు చేపట్టారు. శనివారం మెట్టవీధిలో స్థానికులే కాలువల్లో పేరుకు పోయిన పూడికలను తొలగించి వర్షపునీరు సజావుగా పారేలా పనులు చేపట్టారు. పారిశుధ్య పనులపై పంచాయతీ అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

పొలాల్లో నీరు లేకుండా చర్యలు తీసుకోవాలి

కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రబీలో సాగు చేస్తున్న పెసర, మినప, వేరుశనగ పంట పొలాల్లో వర్షపు నీరు లేకుండా రైతులు చర్యలు తీసుకోవాలని టెక్కలి ఏడీఏ బీవీ తిరుమలరావు అన్నారు. శనివారం కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో నీటిలో ఉన్న పంటలు వరి, వేరుశనగ, అపరాల పంటలను పరిశీలించారు. ఆమదాలవలస కృషి విజ్ఞానకేంద్రం శాస్త్ర వేత్తలతో కలిసి పరిశీలించారు. పంటలు పాడవకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు కె.భాగ్య లక్ష్మి, చిట్టిబాబు, కిరణ్, ఏవోలు ఎస్.గోవిందరావు, ఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి

టెక్కలి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి వేడుకలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ గోవిందమ్మ రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు సెమినార్, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, లూకాపాల్, లక్ష్మణ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● నరసన్నపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యవరం, ప్రభుత్వ ఉన్నత, బాలికోన్నత పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పోటీ నిర్వహించి బహుమతులు అందించారు.

మాదక ద్రవ్యాలు బారిన పడొద్దు

కొత్తూరు, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలు బారిన పడకుండా ఉండేందుకు సంకల్పం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్ తెలిపారు. కొత్తూరు ఎస్సీ బాలుర వసతిగృహంలో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ ఎండీ అమీర్‌అలీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల అలవాటు వల్ల భవిష్యత్తు అంధకార మౌతుందన్నారు. మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం సమాచారం ఉంటే పోలీసులు తెలపాలని పేర్కొన్నారు.

● హిరమండలం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలు సేవించి బంగారు భవిష్యత్‌ను కోల్పోవద్దని ఎస్ఐ ఎండీ యాసిన్ అన్నారు. శనివారం శాస్త్రులపేటలో సంకల్పం కార్యక్ర మాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాలు వినియోగిస్తే కలిగే అనర్థాలను వివరించారు. మాదక ద్రవ్యాలు వాడినా, విక్రయించిన, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెనూను పక్కాగా అమలుచేయాలి

నందిగాం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూను పక్కాగా అమలు చేయాలని ఎంపీ డీవో టి.రాజారావు సూచించారు. శనివారం జయపురం గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. రికార్డులతో పాటు తరగతిగదులు, భోజనశాల పరిశీలించారు. విద్యార్థులను ఆకట్టుకునేలా విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సింహాచలం, వార్డెన్ ప్రకాశరావు, ఉపాధ్యాయులు, కార్యదర్శి గోపినాథ్ పాల్గొన్నారు.

మహా విష్ణుమూర్తికి నక్షత్ర హారతి



జలుమూరు, డిసెంబరు 21: (ఆంధ్రజ్యోతి) దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయంలో కొలువు తీరిన శ్రీమహావిష్ణువుకు శనివారం రాత్రి అర్చకులు నక్షత్ర హారతి, ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి తులసి దళాలతో ప్రత్యేక పూజలు చేసి పొంగలి ప్రసాదాన్ని నివేదిస్తున్నారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, శ్రీకృష్ణ, అప్పారావు, శివ, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ సోషల్‌మీడియా యాక్టివిస్ట్‌కు అభినందన

టెక్కలి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): టెక్కలి టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ దల్లి ప్రసాద్‌రెడ్డికి శనివారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. మంగళగిరి పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన ప్రశంసాపత్రాన్ని అందించారు. టీడీపీ కార్యక్రమాల్లో యాక్టివిస్ట్‌గా ఉన్న ప్రసాద్ మరిన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని ఆయన కోరారు.

ఖైదీలకు ఉచిత న్యాయసేవలు



సబ్ జైల్‌ను సందర్శించిన జిల్లా న్యాయాధికారులు వివేకానంద శ్రీనివాస్, సన్యాసి నాయుడు

పాతపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఖైదీలు న్యాయవాదులను పెట్టుకోలేకపోతే ఉచితంగా న్యాయ సేవలందిస్తామని 3 బెంచ్ అడిషనల్ (ఫ్యామిలీ) జిల్లా న్యాయాధికారి సీహెచ్ వివేకానంద శ్రీనివాస్ అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను శనివారం సందర్శించారు. సబ్‌జైల్‌లో ఉండే ఖైదీలకు మెనూ, వైద్యసేవలు అందింస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాశినాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఈ సత్యనారాయణ, జైల్ విజిటింగ్ న్యాయవాది జి.రామ్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మెళియాపుట్టి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి), మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మెళియాపుట్టి తహసీల్దార్ కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మహిళ తమ హక్కులను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జాతీయ మహిళా కమిషన్ రిసోర్స్ సభ్యురాలు సౌజన్యకుమారి మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆస్తిలో మహిళలు తమకున్న హక్కులను తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న యాసిడ్ దాడు లతోపాటు లైంగిక, వరకట్న వేధింపులను ఎదుర్కొనే విధానాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో ప్రసాద్ పండా, ఏఎస్ఐ బి.అప్పన్న, ఎంఈవో దేవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి ఇంట్లోకి చొరబడిన దొంగలు

- కత్తులతో బెదిరించి బంగారు ఆభరణాల చోరీకి యత్నం
- పోలీసుల అదుపులో ఒకరు.. మరో ఇద్దరి కోసం గాలింపు
- శ్రీకాకుళం నగరంలో కలకలం

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఓ వ్యాపారి ఇంట్లోకి ముగ్గురు దుండగులు కత్తులతో చొరబడి, బంగారు ఆభరణాల చోరీకి యత్నించిన ఘటన శ్రీకాకుళం నగరంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక కాకివీధిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏటీఎంను ఆనుకుని ఉన్న ఇంట్లో కోరాడ గోవింద్ కుటుంబంతో నివసిస్తున్నాడు. ఈయన పెద్ద మార్కెట్‌లో కిరాణా షాపు నడుపుతూ జీవనోపాధి సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఎప్పటిలాగే దుకాణానికి వెళ్లిపోయాడు. రాత్రి 7.20 గంటల సమయంలో ముగ్గురు దుండగులు కత్తులతో గోవింద్ ఇంటికి వచ్చారు. వీరిలో ఇద్దరు ప్రధాన గుమ్మం నుంచి లోపలకు చొరబడి తలుపులు మూసేశారు. అప్పటికే హాల్‌లో గోవింద్ తల్లి సూర్యకుమారి, భార్య మౌనిక టీవీ చూస్తున్నారు. తలుపు చప్పుడు కావడంతో వారిద్దరు లేచి చూసేసరికి ఇద్దరు వ్యక్తులు కత్తులతో కనిపించారు. మరో దుండగుడు ఇంటి వెనుక నుంచి చొరబడేందుకు ప్రయత్నించగా.. వంట గదిలో గోవింద్ అన్న భార్య, ఆమె కుమారుడు గమనించి తలుపులు మూసేశారు. ఇంట్లోకి చొరబడిన ఇద్దరు దుండ గులు గోవింద్ తల్లిని, భార్యను కత్తితో బెదిరించి మెడలో బంగారు ఆభరణాలు దోచుకునేందుకు ప్రయత్నిస్తుండగా.. వంట గదిలోంచి కూరగాయలు తరిమే కత్తితో గోవింద్ అన్న కొడుకు, చీపురు కట్టతో మౌనిక ప్రతిఘటించి.. దొంగలు అంటూ పెద్దగా కేకలు వేశారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో కేకలు బయటకు వినిపిస్తుండడంతో దొరికిపోతామన్న భయంతో ఆ ఇద్దరు దుండగులు తమతో తెచ్చుకున్న కత్తులను అక్కడే పడేసి పారిపోయారు.



పోలీసుల అదుపులో నిందితుడు

పోలీసుల అదుపులో దుండగుడు

ఇంట్లో కత్తులు వదిలేసి పరారైన దుండగులను స్థానికులు వెంబడించగా, మరో పక్క పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని పారిపోవడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. అయితే మరో ఇద్దరు మాత్రం బైక్‌పై పరారయ్యారు. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ కె.పైడపునాయుడు దొరి కిన ముద్దాయిని.. విచారించి స్టేషన్‌కు తరలించారు. కొద్ది సేపటికే శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద అక్కడకు చేరుకున్నారు. ఇంతలోనే క్లూస్ బృందం అక్కడకు చేరుకుని వేలిముద్రలు సేకరించారు. అయితే నిందితులు ముగ్గురు తెలంగాణకు చెందిన వారుగా పోలీసులు అనుమానిస్తున్నారు. పరారీలో ఉన్నవారి కోసం వన్‌టౌన్ పోలీసులు, సీసీఎస్ బృందం గాలింపులు చేపడుతున్నారు. అయితే గోవింద్ ఇంట్లో చోరీకి ప్రయత్నించిన వారు పక్కా ప్రణాళికతో వచ్చారని పోలీసులు అనుమానిస్తున్నారు. ముందే రెక్కీ చేసి ఉంటారని పోలీసులు అభిప్రాయపడు తున్నారు. అసలు గోవింద్ ఇంట్లో ఎప్పుడూ భార్య, కదలలేని తల్లి మాత్రమే ఉంటారు. అయితే శనివారం మాత్రం వారిద్దరితో పాటు అన్న భార్య, ఆమె కుమారుడు ఉండడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. గోవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కె.పైడపునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ల పదవి నుంచి ఇద్దరి తొలగింపు

టెక్కలి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పద వుల నుంచి టెక్కలికి చెందిన బగాది శేషగిరి, ఎస్ఎంపురానికి చెందిన చౌదరి బాబ్జిలను తొలగించారు. ఈ మేరకు వెనుకబడిన తరగతుల శాఖ కార్యదర్శి డాక్టర్ పోల భాస్కర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా రోణంకి కృష్ణంనాయుడుతోపాటు మరో 13 మంది డైరెక్టర్లను గతంలో నియమించారు. అయితే ఈ డైరెక్టర్ పదవులు తమకు ఆసక్తి లేదని చౌదరి బాబ్జి, బగాది శేషగిరి ఇటీవల టీడీపీ అధిష్ఠానానికి తెలిపారు. దీంతో అధిష్ఠానం.. ఈ పదవుల నుంచి వారిద్దరిని తప్పించి మరో ఇద్దరికి అవకాశం కల్పించింది.

పీఎంఏవైకి దరఖాస్తు చేసుకోండి

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం కలిగిన లబ్ధిదారులు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సోషల్ హౌసింగ్ డెవలప్‌మెంట్ అధికారి సీహెచ్ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ.. స్థానిక సచివాలయాల్లో ఈనెలాఖరులోగా దరఖాస్తు అందించాలన్నారు. ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు సంయుక్తంగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కుటుంబ సభ్యుల ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్సులు జత చేయాలన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వందస,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిపంట పూర్తిగా తడిచి రైతులు తీవ్రంగా నష్టపోయారని, తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మహేంద్ర రైతుసంఘ నాయకులు బెస్త కామేశ్వరరావు, ఎం.మాధవరావు కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఎకరాలకు రూ.20 వేల నష్టపరిహారం అందజేయాలని కోరారు.

సకాలంలో జనన ధ్రువపత్రాలివ్వండి

వందస,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సకాలంలో జనన ధ్రువపత్రాలను అందించాలని పలువురు సభ్యులు కోరారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ డొక్కర దానయ్య అధ్యక్షతన మండల బడ్జెట్ సమావేశం శనివారం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సవరణ, 2025-26 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. తహసీల్దార్ కార్యాలయంలో విద్యార్థులకు జనన ధ్రువపత్రాల జారీలో జాప్యం జరుగుతోందని పలువురుసభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే అకాల వర్షాలకు తడిచిన, రంగుమారిన ధాన్యం తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు వి.మాధవరావు కోరారు. ఎంపీడీవో పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు

పోలాకి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా మూడురోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు వరి పంట పాడైన రైతులకు ఇబ్బంది లేకుండా కృషి చేస్తామని మండల ప్రత్యేకాధికారి సుధాకర్, తహసీల్దార్ మంగిపూడి సురేష్, ఏవో చిరంజీవి హామీ ఇచ్చారు. శనివారం వారు సుసరాం తంపరలో తడిచిన వరి కుప్పలను పరిశీలించారు.

● నందిగాం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పంట నష్టపోకుండా ఉండేందుకు ఏవో పి.శ్రీకాంత్ వర్మ రైతులకు సూచనలు చేశారు. శనివారం దేవళభద్ర, జల్లపల్లి గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు.

తడుచుకుంటూ పరీక్షలకు..

- ఇబ్బందులు పడిన డిగ్రీ విద్యార్థులు



వర్షంలోనూ పరీక్షా కేంద్రానికి వస్తున్న డిగ్రీ విద్యార్థినులు

నరసన్నపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ సెమి స్టర్-1 పరీక్షలు ఈనెల 12 నుంచి జిల్లాలో 55 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. సుమారు 1,050 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. గడచిన రెండు రోజులుగా జోరుగా కురిసిన వర్షాలకు ఇబ్బందులు పడుతూ పరీక్షలకు హాజరయ్యారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల కొందరు తడుచుకుంటూ పరీక్ష సెంటర్లకు హాజరుకాగా వాతావరణంలో మార్పుతో పూర్తిగా చలితీవ్రత ఎక్కువగా ఉన్నా పరీక్షలు రాయాల్సి వచ్చిందని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. యూనివర్సిటీ అధికారులు పరీక్షలు వాయిదా వేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. కోటబొమ్మాళి, చల్లపేట కళాశాలల విద్యార్థులకు నరసన్నపేటలో పరీక్షా కేంద్రాలను కేటాయించడంతో వర్షాలకు సకాలంలో బస్సులు లేక ఇబ్బంది పడినట్లు విద్యార్థులు ఆవేదన చెందారు.

అల'కల్లోలం'

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా వాయుగుండంతో వర్షాలు కురుస్తుండడంతో బంగాళాఖాతం అల్లకల్లోలంగా మారింది. అలలు ఎగిసిపడుతుండడంతో మత్స్య కారులు చేపల వేటకు వెళ్ల వద్దని అధికారులు గ్రామంలో దండోరా వేశారు. మత్స్యకారులు వలలు, పడవలు, తెప్పలను ఒడ్డుకు చేర్చారు. పర్యాటకులు సముద్రంలో స్నానాలు చెయ్యవద్దని పోలీసులు హెచ్చరించారు. మరో రెండురోజుల పాటు సముద్రం ఇలాగే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కాగా వర్షాలకు రోడ్లన్నీ జలమయం కావడంతో వాహదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఉన్న గోతులు పూడ్చక పోవడంతో వర్షపు నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబు తున్నారు.



శివసాగర్ తీరంలో ఎగిసిపడుతున్న అలలు

చినుకుపడితే చిత్తడే

మెళియాపుట్టి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయమై దారుణంగా తయారయ్యాయి. టెక్కలిపట్నం రోడ్డు జంక్షన్- సంతలక్ష్మీపురం-పలాస గోథావరి రోడ్డు, టాకోయి, గొడ్డ-అంపురం రోడ్లు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థి తులు నెలకొన్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలన లో రోడ్లపై నిర్లక్ష్యం వహించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



సంతలక్ష్మీపురం వద్ద రోడ్డు

తడిసి ముద్దయిన కార్యాలయాలు

నందిగాం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఏకధాటిగా పడిన వర్షాలకు ప్రభుత్వ కార్యాలయాలు తడిసి ముద్దయ్యాయి. ఎంపీడీవో కార్యాలయం, మండల రీసోర్స్ కేంద్రం, ఉపాధి కార్యాలయాల్లో పైకప్పు నుంచి వర్షపు నీరు కారి విధులకు ఇబ్బందులు తలెత్తాయి. మండలంలో వర్షాలు కారణంగా రైతులు ధాన్యాన్ని రక్షించుకునేందుకు పాట్లు పడ్డారు.



వర్షంతో తడిచిన మండల పరిషత్ సమావేశ మందిరం